# అయోమయంలో అన్నదాత

**ధాన్యం డబ్బుల కోసం తప్పని ఎదురుచూపులు**

- నగదు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం
- ఏప్రియల్ చివరి వారంలో లోడింగ్ చేసినా నేటికి అందని నగదు
- తరుగు పేరిట ఎంత తగ్గిస్తారో తెలియని వైనం


కాంటాలు వేసిన ధాన్యం (ఫైల్)

**వేంసూరు:** నారు పోసిన దగ్గర నుంచి పంట విక్రయించుకునే దాక అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కరెంట్ కోత, నీటి ఎద్దడి, తెగుళ్లతో తంటాలు పడి పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించినా పంటను అకాల వర్షాల నుంచి కాపాడుకుని పంటను విక్రయించినా ధాన్యం డబ్బులు జమకాకపోవడంతో అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారింది.

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచిస్తున్నా.. కింద స్థాయిలో రైతులకు మాత్రం తిప్పలు తప్పడంలేదు. గతంలో ధాన్యం విక్రయించిన వారంలోపు నగదు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. కానీ ప్రస్తుతం అందుకు భిన్నంగా నగదు జమ జాప్యం అవుతుంది.

**రైతులపై వడ్డీ భారం..**

పంటల సాగుకు అన్నదాతలు కొందరు ఎరువుల దుకాణాదారుల వద్ద, మరికొందరు వేర్వేరు విధాలుగా అప్పులు తెచ్చి పంటలను సాగు చేశారు. పంట విక్రయించిన వెంటనే అప్పులు తీర్చుకుందామని ఆశించిన అన్నదాతకు నిరాశే మిగులుతోంది. ఏప్రిల్ చివరి వారంలో లోడింగ్ చేసిన ధాన్యం నగదు సైతం రైతుల ఖాతాల్లో జమ కాలేదు. దాదాపుగా 25 రోజులు అయినా నేటికీ ఏ ఒక్క రైతుకు రూపాయి కూడా చెల్లించలేదు.

**కొనుగోలు కేంద్రాల్లోనూ తంటాలు..**

కొనుగోలు కేంద్రాలకు తరలించినా ధాన్యం విక్రయించుకొనేందుకు రైతుల నానా పాట్లుపడుతున్నారు. తేమ, తాలు, తూర్పారా క్వింటాకు కేజీ చొప్పున అధిక కాంటా అనేక ఇబ్బందులకు గురి చేశారు. అన్ని కష్టాలు తట్టుకుని పంట విక్రయించి మిల్లర్లకు తరలించిన తరుగుపేరా మరో రకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. విక్రయించినా పంటలో ఎంత మేర తరుగుపోతుందో ఎన్ని క్వింటాళ్లకు నగదు జమ చేస్తారో తెలియని అయోమయ స్థితిలో అన్నదాత ఉన్నారు. ఇప్పటికైనా నగదు జమచేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

**చెల్లింపుల్లో తీవ్ర జాప్యం**



ధాన్యం విక్రయించుకునేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద అనేక రోజులు ఇబ్బందులు పడ్డాం. పంట విక్రయించి దాదాపు 20 రోజులు అవుతున్నా నగదు జమ కాలేదు. ఇప్పుడు నగదు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

– బండి శ్రీనివాసరెడ్డి, కల్లూరుగూడెం, రైతు

**వెంటనే డబ్బులు చెల్లించాలి**



ధాన్యం కొనుగోలు మొదలు పెట్టిన దగ్గర నుంచి నేటి వరకు నగదు చెల్లింపు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి మరీ పంటలు సాగుచేసాం. అప్పుల భారం నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించి ఆదుకోవాలి.

– అట్లూరి సత్యనారాయణరెడ్డి, అడసర్లపాడు

## పంట నష్టంపై అధికారులకు నివేదిక


మాట్లాడుతున్న ఎంపీడీఓ

**మధిర:** ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి డీఎస్ కె. శ్రీనివాసరావు తెలిపారు. మధిర మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లలిత అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాటూరు పేట, దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వెంకటేష్, పృథ్వీ నాయక్ మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సిలార్ సాహెబ్ మాట్లాడుతూ... తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జూన్ 2 నుంచి 20 వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

## యువతను విస్మరిస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

**ఎర్రుపాలెం:** కేంద్ర ప్రభుత్వం యువతను విస్మరిస్తోందని, ఏటా కోట్ల ఉద్యోగాలిస్తామని ఎన్నికల హామీలిచ్చి గాలికొదిలేసిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జోన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రకటించిన పంట నష్ట పరిహారాన్ని తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం అందించలేని ప్రభుత్వానికి రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించుకోవడానికి డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, నాయకులు తేలప్రోలు రాధాకృష్ణ, గామాసు జోగయ్య, సగుర్తి సంజీవరావు, షేక్ నాగులమీరా, దేవరకొండ రామకృష్ణ, తోట సాంబశివరావు, బసవయ్య, రవి, షేక్ మస్తాన్, సుబ్బారెడ్డి, పుల్లారావు, శ్యామలరావు, గురవయ్య, శివయ్య, మహేష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన కరాటే శిక్షణ


చిన్నారులతో ఉమా మహేశ్వరరావు

**సత్తుపల్లిటౌన్:** ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు, శారీరక దారుఢ్యానికి కరాటే ఎంతగానో దోహదపడుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు అన్నారు. లయన్ బుడోఖాన్ కరాటే హెల్త్‌క్లబ్ చైర్మన్ కరాటే మాస్టర్ వి.పిచ్చయ్య ఆధ్వర్యంలో స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నెలరోజుల పాటు నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు,ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### అమరుల ఆశయ సాధనకు కృషి

**కొణిజర్ల:** నిరుపేద, అణగారిన వర్గాల పక్షాన పోరాడిన అమరుల ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. మండలంలోని గ్రామంలో మంగళవారం సీపీఎం నాయకులు పెద్దమళ్ల అప్పారావు, యాసా లక్ష్మీనరసయ్యల వర్ధంతి సందర్భంగా పలువురు నాయకులు వారి స్మారక స్థూపాల వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. అన్నారపు వెంకటేశ్వర్లు, చింతనిప్పు సూరయ్య, వెంకయ్య, ప్రభాకర్, సాంబ, జగ్గారావు, ఏసు, తిలక్, తిలకం, నాయకులు విష్ణుమూర్తి, గోపాలరావు, వెంకటేశ్వర్లు, సరస్వతి, శ్రీనివాసరావు, శంకరరావు, రామారావు ఉన్నారు.

## సీఎం చిత్రపటానికి జేపీఎస్‌ల పాలాభిషేకం

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణ చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా జేపీఎస్‌లు మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


వైరారూరల్: పాలాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు


ఎర్రుపాలెంలో..


కారేపల్లిలో..

### టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థి ప్రతిభ


అజయ్‌ను అభినందిస్తున్న ప్రవీణ్

**తల్లాడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో స్థానిక బాలభారతి విద్యాలయానికి చెందిన విద్యార్థి తోట అజయ్ జిల్లా స్థాయిలో రెండో స్థానం సాధించి ప్రతిభ కనబర్చాడు. జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు హాజరుకాగా అజయ్‌కు వెండి పతకం లభించింది. ఈ మేరకు అజయ్‌ను కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ అభినందించారు.

### బాధితుడికి చేయూత


నగదు అందజేస్తున్న క్రాంతి, తదితరులు

**సత్తుపల్లిరూరల్:** మండలంలోని బుగ్గపాడుకు చెందిన వంగా విష్ణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన విష్ణుకి యువభారత్‌శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోషల్‌మీడియా ద్వారా రూ.87,500 సేకరించి బాధిత కుటుంబానికి మంగళవారం అందించారు. ఫౌండర్ కామెర్ల క్రాంతి, సభ్యులు పాల్గొన్నారు.

## దేశానికే ఆదర్శంగా తెలంగాణ పథకాలు


చెక్కు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

**మధిర:** దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. స్థానిక తహసీల్‌లో మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, ఎంపీపీ లలిత, తహసీల్దార్ రాజేష్, ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించండి..


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సీతారాం

**సత్తుపల్లిటౌన్:** హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సీతారాం అన్నారు. సత్తుపల్లిలోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన డివిజన్ స్థాయి వైద్యుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య సేవల్లో డివిజన్‌ను ముందుంచాలని సూచించారు. అనంతరం డివిజన్ ఆఫీస్ డీఈఓ శ్రీనివాస్ అందిస్తున్న సేవలను అభినందిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అవినాష్, చింతా కిరణ్‌కుమార్, రాములు, నవ్యకాంత్, సౌమ్య, రత్నమనోహర్, ఇందు, పాషా, రవితేజ, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

**తల్లాడ:** సమాజంలో ప్రతి ఒక్కరూ సమాచారం హక్కు చట్టం(ఆర్టీఐ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. మండలం తెలగవరం గ్రామంలో మంగళవారం సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టీఐ చట్టం ద్వారా ఏ సమస్యనైనా తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. అధికారులు, గ్రామాల్లో చేస్తున్న పనులను ఈ చట్టంతో వారం రోజుల్లో తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఐ సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి లక్ష్మీ, కొరకొప్పు డేవిడ్, సర్పంచ్ తేళ్లూరి కృష్ణయ్య, ముప్వా మురళీదర్‌రావు, ఆర్టీఐ జిల్లా కన్వీనర్ అనీల్‌కుమార్, మండల కన్వీనర్ ఏపూరి సాయి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### వరకట్నం వేధింపుల కేసు నమోదు

**కల్లూరు:** మండలంలోని చెన్నూరుకు వివాహితను భర్త, అత్త, మరికొందరు వరకట్నం కోసం వేధిస్తుండడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన భావనకు ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన మూడుముంతల పుల్లారావుతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఐదేళ్లుగా భర్త, అత్త అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో రెండు నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. ఈక్రమంలో భర్త పుల్లారావు, ఆయన స్నేహితులు వచ్చి ఘర్షణకు దిగడంతో ఆమె పోలీసులను ఆశ్రయించగా మంగళవారం కేసు నమోదు చేశారు.

**అటెన్షన్ ప్లీజ్**

## ప్రమాదకరంగా రహదారి



మండల పరిధిలోని తూతకలింగన్నపేట సమీపంలోని కల్వర్టుపై ఉన్న రహదారి గుంతలమయమై ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఈ రహదారిపై నిత్యం అనేక వాహనాలు రాకపోకలు కొనసాగిస్తాయి. గుంతలతో భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

– ఏన్కూరు

ప్రశ్నించాల్సిన అధికారి : ప్రవీణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 7660805013

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్


వైరా: విత్తన డీలర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ సురేష్, అధికారులు

**వైరా:** విత్తన డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పీడీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని వైరా ఏడీఏ వేల్పుల బాబూరావు, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ జె.హేమంతకుమార్ హెచ్చరించారు. మంగళవారం వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి మండలాల విత్తన డీలర్లతో పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్, వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు నిరంతరం విత్తన దుకాణాలపై పర్యవేక్షణ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైరా సీఐ తాటిపాముల సురేష్, వైరా సబ్ డివిజన్ పరిధిలోని ఏఓలు, డీలర్లు పాల్గొన్నారు.

**కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి**

**మధిర:** రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని మధిర మండల వ్యవసాయ అధికారి డీఎంకే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్ కలిగిన అధీకృత విత్తన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. అడ్వాన్స్ బుకింగ్ చేసుకోమని, అనుమతి లేని వ్యక్తులు గ్రామాల్లో తిరిగి వివిధ రకాల రాయితీలు, ఆఫర్లు, గిఫ్టులు అని ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందన్నారు.


**రైతులు అప్రమత్తంగా ఉండాలి**


కల్లూరు: అవగాహన కల్పిస్తున్న ఎస్సై రఘు

**కల్లూరు:** నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.రఘు రైతులను కోరారు. స్థానిక రైతు వేదికలో మంగళవారం డీలర్లకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో లేబుల్ లేకుండా విత్తనాలు అమ్మిన, గడువు ముగిసిన విత్తనాలు అమ్మిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులతో పాటు డీలర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎం రూప, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

**ఏన్కూరు:** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బాదావత్ రవి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విత్తన డీలర్లకు మంగళవారం సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుమతి లేని విత్తనాలను అమ్ముతున్న వారి వివరాలు పోలీసులకు ఇవ్వాలని కోరారు. వ్యవసాయాధికారి నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

**పెనుబల్లి :** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై జి. సూరజ్, వ్యవసాయాధికారి ఏఈఎస్ఎస్ రాజు హెచ్చరించారు. మండల పరిధిలోని ఎరువుల దుకాణాల వ్యాపారులు, విత్తన దుకాణాల వ్యాపారులకు పెనుబల్లి రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు.


ఏన్కూరు: మాట్లాడుతున్న ఎస్సై బాదావత్ రవి


పెనుబల్లి: మాట్లాడుతున్న ఎస్సై సూరజ్

## క్లుప్తంగా

### బాలల సంరక్షణ కమిటీ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న అధికారులు

**మధిర:** మహిళ శిశు వికలాంగుల వయోవృద్దుల సంక్షేమ శాఖల వారిచే జిల్లా బాలుర పరిరక్షణ విభాగం ఖమ్మం వారి ఆధ్వర్యంలో మధిర మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాలల సంరక్షణ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సోనీ ప్రేమలినా పాల్గొని మాట్లాడుతూ సమగ్ర బాలల సంరక్షణ పథకాలను అందరికీ అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేష్ ఎంపీడీఓ ఎస్‌కే.సిలార్ సాహెబ్, వైద్యులు వెంకటేష్, పృథ్వీ, ఐసీడీఎస్ సీడీపీఓ శారద శాంతి, ఎక్సైజ్ ఎస్సై శార్వాణి పాల్గొన్నారు.

**గౌరెల సొసైటీ పాలకవర్గం..**

**ఎర్రుపాలెం:** మండలంలోని బనిగండ్లపాడులో మంగళవారం స్థానిక యశోద కృష్ణ గౌరెల సొసైటీ నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బండారు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బాదినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బండారు నవీన్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఖమ్మం రిజిస్ట్రార్ గంగారపు ఉషశ్రీ సమక్షంలో సొసైటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, వెంకటనారాయణ, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపిక

**కల్లూరు రూరల్:** మైనార్టీ కార్పొరేషన్‌లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. మండలపరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న మండలానికి చెందిన 188 మందికి గాను లాటరీ ద్వారా ముగ్గురిని ఎంపిక చేశారు. సయ్యద్ ఇంతియాజ్ ( 2లక్షల యూనిట్), షేక్ నూర్అహ్మద్ (లక్ష యూనిట్) షేక్ మజహర్‌పాషా (లక్ష యూనిట్) ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు.

### ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

**చింతకాని:** మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించనున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు నున్నా తాజుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు, కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, తెలుగు రైతు మండలాధ్యక్షుడు పెంట్యాల రామారావు, నాయకులు నన్నక గోపాలరావు, మల్లెల సత్యనారాయణ, నన్నక రామారావు తదితరులు పాల్గొన్నారు.

### దాడి ఘటనలో ఐదుగురిపై కేసు

**చింతకాని:** మండలంలోని పాతర్లపాడులో ఇంటి విషయమై జరిగిన గొడవకు సంబంధించి ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇంటి స్థలం విషయంలో బత్తుల సీతారాములు కుటుంబసభ్యుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ మేరకు గత ఆదివారం రాత్రి బత్తుల ప్రసాద్, పద్మ, జానకీరాములు, చల్లా ఆనంద్, చింతల వెంకటేశ్వర్లు కలిసి సీతారాములుతో గొడవ పడడమే కాక ఇంటిపై దాడి చేసి సీతారాములు, ఆయన కుమారుడిని కొట్టారు. దీంతో సీతారాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పి.వెంకన్న తెలిపారు.

### ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'ప్రజాగర్జన'

**సత్తుపల్లిరూరల్:** ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జూన్ 4న జరిగే ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు మోదీ గద్దె దింపాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అడిషనల్ సెక్రటరీ మిర్యాల రంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జేవీఆర్ ఓసీలో గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశంలో బంగారు బాతుల్లాంటి సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ కార్మిక వర్గంపై కత్తి పెట్టి 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక వర్గాన్ని విస్మరించి పరిపాలన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి జీవీఆర్ స్వామి, జాయింట్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఫిట్ కార్యదర్శి దారా భీమయ్య, జి.నర్సింహారావు, కాగితం వెంకటేశ్వర్లు, దమ్మాలపాడు సురేష్, వెంకటేశ్వర్లు, రాంబాబు, వెంకట్, గట్టయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.